# తుఫాన్



## సుమ ఇంకా రాలేదేం?

చదువుతున్న పుస్తకంలోంచి తలఎత్తి చూసాను సమయం ఐదుగంటల పదినిముషాలు

రోజూ ఈ వేళకి వచ్చేసేది. కిటికీ తలుపులు తీసి చూశాను.చల్లనిగాలి మొహానికి తగిలింది. దూరం నుండి నల్లని మబ్బు తునకలు ప్రపంచాన్నికలుసుకోవడానికి వస్తున్నాయి. కానీ సుమన జాడలేదు.

నా గదిలో స్తబ్దత— అలవాటు పడని స్తబ్దత. వచ్చి కుర్చీలో కూలబడ్డాను. ఎదురుగా అప్పుడే పూర్తిచేసిన గేయం కనుపిస్తోంది. యథాలాపంగా తీశాను. మరోసారి చదివేను. ఆ గేయంలోని పదాలకి సుమకి ఉన్నంత అందంలేదనిపించింది. పెన్నుతీసి శ్రద్ధగా దిద్దేను— ఆ.ఇప్పుడు కొంచెం బాగుంది.

వినుకులు మొదలయ్యాయి. గ్రీష్మ కాలపు ఎండకు ఎండిపోయిన ప్రపంచం తొలకరి వినుకులకు పులకరించిపోతోంది. సుమ ఇంక ఈ వేళ రాదా?!

చాలా రోజుల నుంచి చెబుతోంది తనమీద ఒక గేయం వ్రాయమని ఆఖరికి వ్రాసాను ఈ రోజు.

మరోసారి ఆ గేయాన్ని చదివేను. బాగానే వుందిగానీ ఎంత ప్రయత్నించినా ఆమె అందాన్ని పదాలలో బంధించలేకపోయాననే అనిపిస్తోంది.

వాన ఎక్కువైనట్లుంది. జల్లులోపలికి వస్తోంది. ఇలా వాన కురుస్తుంటే ఇక సుమ ఎలా వస్తుంది ఈ రోజు?

నా మీద నాకే కోపం వస్తోంది. ఛీ ఈ గేయం నిన్ననే వ్రాయాల్సింది. నిన్నయితే వర్షంలేదు.

* *

సుమారు వారంరోజుల క్రితం ఏదో పాటని సన్నగా గొణుగుతూ పరుగెత్తుకొని వచ్చింది సుమ. "మా అమ్మ అడిగింది ఈ రోజు. రోజూ మాష్టారిగదిలో కెళుతున్నావని?"

"నువ్వేం చెప్పావు?" నేను నవ్వుతూ అడిగేను.

"ఇంకేం అంటాను? నాకు మాష్టారన్నా, మాష్టారి గేయాలన్నా ఇష్టమనే"

"ఎలాంటి ఇష్టం?" అని అడగాలనిపించిందిగానీ సుమవైపు చూస్తూ ఉంటే నా మాటలు నన్ను వదిలి వెళుతున్నట్లనిపించాయి.

"మా అమ్మ ఏమందో తెలుసా? నువ్వేం చిన్నపిల్లవిగాదు వయసొచ్చిన దానివి. మాష్టారెంత మంచివారైనా, అతని వయస్సు నలభై దాటినా నువ్వు జాగ్రత్తగా మసలాలి. అస్తమానం అలా వెళ్లకూడదు" అంది సుమ గట్టిగా నవ్వుతూ చెప్పింది.

"అలా అయితే మీ అమ్మ దగ్గరే కూర్చోకపోయావా? నా దగ్గరకెందుకొచ్చావు?"నేను కోపం దాచుకోలేకపోయాను.

సుమ అందంగా నవ్వి "కోపం తెచ్చుకోకండి మాష్టారు. నలభై దాటితే నేమి? మీరు కుర్రాళ్లాగానే కనిపిస్తున్నారు" నా భుజంమీద చెయ్యేసి చెప్పింది.

ఆ తొలి స్పర్శకి వళ్లంతా పులకరించింది. అనిర్వచనీయమైన ఒక అనుభూతి. ఆమె చేతిని అలాగే గట్టిగా పట్టుకోవాలనిపించింది. కానీ శిలలా నిల్చుండిపోయాను. నా యవ్వనం ఏ నాడో నాకు సెలవు చెప్పి వెళ్లిపోయిందనే నిజం మళ్లా ఒక్కసారి గుర్తుకొచ్చింది.

సుమ పసిపాపలా నవ్వి దూరంగా ఉన్న టేబిల్ వైపు వెళ్లిపోయింది. టేబిల్ మీద కాగితాలు అటూ, ఇటూ తిప్పి చూస్తూ అడిగింది. "కొత్తగా ఏం వ్రాయలేదా?"

లేదని తల ఊపాను. ఎన్నో రోజులైంది. కొత్తగా ఏమన్నా వ్రాసి. వ్రాయాలనుకున్నప్పుడల్లా సుమే గుర్తుకొస్తోంది. వ్రాయలేకపోతున్నాను.

"ఇదేం బాగోలేదు మాష్టారు. మీకు బద్ధకం ఎక్కువైపోతోంది" టేబిల్ పై వున్న ఉదయం వీక్లీ పేజీలు తిరగవేస్తూ అంది సుమ.

నేనేం మాట్లాడలేదు. కిటికీలోంచి అస్తమిస్తున్న సూర్యుణ్నే చూస్తున్నాను.

నా మీద గేయం వ్రాయరూ?" గోముగా అడిగింది. నేను సమాధానం చెప్పేలోగానే "రేపు వస్తానే మేష్టారూ" అంటూ గెంతుతూ వెళ్లిపోయింది.


* * *

టేబిల్ మీద కాగితాలు గాలికి రెపరెపలాడుతున్నాయి. సుమ కళ్లముందు కదులుతోంది. సుమ వయస్సులో నేను ఉన్నప్పుడు!....నేను దాటిన జీవితంలో వసంతకాలం గుర్తుకొచ్చింది.

* *

"ఒరేయ్! సీతకి సంబంధాలు చూస్తున్నామని మీ మామయ్య చెప్తున్నాడురా" ఇరవై సంవత్సరాల క్రితం ఒకసాయంకాలపు వేళ అమ్మ ఆందోళనతో చెప్పింది.


భారతదేశంలో విమానాలద్వారా ఉత్తరాల బట్వాడా 1911లో ప్రారంభమైంది. అలహాబాద్ నుండి ఐరోపాలోని ఒక నగరానికి మొదటి బట్వాడా జరిగింది.



T-4

© Amrita Bharati 1990

ఆ తొలి స్పర్శకి వళ్ళంతా పులకరించింది అనిర్వచనీయమైన ఒక అనుభూతి. ఆమె చేతిని అలాగే గట్టిగా పట్టుకోవాలనిపించింది.




''చూడనీ. మరి పెళ్లిచెయ్యాలిగా''

''అదేంటిరా? చిన్నప్పటినుండీ సీతకీ, నీకూ పెళ్ళి చెయ్యాలనిరా నా ఆశ''

నాకు భలే కోపం వచ్చింది.

''నీకు ఎన్నిసార్లు చెప్పానమ్మా? నాకు పెళ్ళిచేసుకునే ఉద్దేశం అసలు లేదని''

అమ్మ కళ్ళు నీటితో నిండటం చూశాను. మనస్సులో బాధనిపించి చెప్పాను. ''అమ్మా నేనెవ్వరినీ పెళ్లిచేసుకోను. పెళ్ళి నా సాహిత్యోపాసనకి అడ్డమ్మా''

''బుద్ధిలేకపోతే సరి. రచయితలంతా నీలా సన్యాసం పుచ్చుకొంటున్నారా?'' అని కళ్ళు వత్తుకుంటూ వెళ్ళిపోయింది పక్క గదిలోకి.

సీతకి పెళ్లయింది. పిల్లలూ పుట్టారు. నా కలంలో నుంచీ చాలా రచనలు పుట్టాయి. పేరు ప్రతిష్ఠలు తెచ్చాయి. కానీ ఇప్పుడు ఈ నలభై ఆరోఏట నేనొక ప్రేమికుడనైనానంటే నాకే నవ్వు వస్తోంది.

ఈ వేళ సుమకి అన్నీ చెప్పేయాలి. ఇంకా మనస్సులో దాచుకొని ప్రయోజనం లేదు. కానీ ఈ రోజు సుమ ఇంకా రాలేదు.

కిటికీ దగ్గర కెళ్లి చూశాను. వాన ఉధృతం కాస్త తగ్గినట్లుంది ఆకాశమంతా మబ్బు కమ్మేసింది. తుఫాను రాగలదన్న ఆకాశవాణి హెచ్చరిక నిజమయ్యేట్లే ఉంది చూస్తుంటే.

దూరం నుంచి తెల్లని పరికిణీ, జాకెట్టు కనిపిస్తోంది.

సుమ వచ్చేస్తోందన్నమాట, మనస్సుకెంతో సంతోషం కలిగింది. అన్నీ చెప్పేయాలివాళ. చెప్పవలసిన మాటలు నెమరు వేసుకొన్నాను గబగబా.

చేతుల్లో ఏదో పొట్లాంలాగుంది. గేటుదాటుతోంది సుమ. వాకిట్లో నిలచిపోయిన వాన నీళ్ల కాళ్లతో చిమ్ముతూ వస్తున్న సుమని చూసి టపాటపా కొట్టుకొంటోంది హృదయం.

''ఇదిగో మాష్టారూ ఇది మీ కోసం తెచ్చాను'' అని పొట్లాం బల్లమీద పడేసింది.

''ఏమిటిది?''

''స్వీట్సు మా ఇంట్లో చేసినవే''నీలం రంగు జాకెట్ ఓణీతో తడిసిన తల తుడుచుకుంటూ అంది.

''ఈ వేళ శనివారంకదా? నేనేం తినను. పళ్ళూ, పాలూ తప్ప''

''అయితే మీకూ ఈ ఉపవాసాల పిచ్చివుందన్న మాట?''

నా మాటలు మళ్లీ దొక్కున్నాయి. ఆమె గురించి వ్రాసిన గేయం చేతిలోకి తీసుకొన్నాను. సుమగేయం గురించి అడగదేం?''

''ఈ వేళ మా ఇంట్లో విశేషమేంటో అడగరేం మాష్టారూ?''

నాకు నవ్వొచ్చింది. ఆ అడిగే తీరుకి. కానీ నవ్వితే తనకి కోపం వస్తుందేమోనని నవ్వును ఆపుకొని అడిగేను.

''ఏమిటి విశేషం?''

సుమ బుగ్గలు ఎరుపెక్కాయి. సిగ్గుతో మొహం దించుకొని మెల్లగా అంది ''నన్ను చూడడానికి ఎవరో వచ్చారు''

ఎవరో సుత్తితో నా తలపై కొట్టినట్లనిపించింది. పడిపోతానేమోనని కుర్చీని గట్టిగా పట్టుకున్నాను.

''అన్నీ నిశ్చయం చేసే వెళ్ళారు వాళ్లు. ఈ నెల్లోనే ముహూర్తం! ఆయనకి లీవులేదట''

సుమ ఇంకా ఏదో చెబుతూనే ఉంది. నాకేం వినిపించటంలేదు.

గదిలోకి రివ్వున సుడిగాలి జల్లుతోపాటు వచ్చింది. తుఫాను ప్రారంభమైనట్లుంది. ప్రపంచానికి వెలుగు తగ్గిపోయింది.

''మాష్టారూ మీరేం మాట్లాడరేంటండీ?'' నా వంక చూసింది సుమ.

నేను కోపం దాచుకోలేకపోయాను. నా కంట్లో వెలిగే కోపాగ్ని చూసి కాబోలు మొహం దించుకుంది. మెల్లగా చెప్పింది. ''నన్ను మన్నించండి మాష్టారూ నిజంగా నాకూ ఇప్పుడే తెలిసింది. ముందుగా తెలిస్తే మీకు చెప్పేదాన్ని''

ఆ మాటలలోని దైన్యం నా మనస్సుని జాలిపరచలేదు. కోపంగా కిటికీదగ్గరకెళ్లి రోడ్డువైపు చూస్తూ నిలుచున్నాను.

జడివాన పడుతోంది. గాలికి తట్టుకోలేక చెట్లు ఊగిసలాడుతున్నాయి. ఎవ్వరూ లేరుకాబోలు— ఎక్కడికీ వెళ్ళలేకనే కాబోలు ఈ జడివానలో తడుస్తూ చలికి వణుకుతూ ఒక కాకి చెట్టుమీద కూర్చుంది ఒంటరిగా.

''ఇక ఇది వరకటిలాగా రోజూ రావటం కుదరదేమో?'' గుమ్మంవైపు వెళుతూ అంది సుమ.

''ఏనా మాష్టారూ నన్ను మర్చిపోవద్దని నా ప్రార్థన'' చేతులు జోడించి అలాగే వానలో తడుస్తూ పరిగెత్తుతూ వెళ్లిపోయింది.

చేతిలోని గేయాన్ని విసిరి పారేశాను. అదీ నీళ్లలో ఈదుతూ వెళ్ళిపోయింది. ●

ఎల్. ఆర్. స్వామి